భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఉదయమే భక్తులు మంగళ స్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యంగా వడపప్పు, పానకం, ప్యాల లపిండి,పండ్లు పూలు సమర్పించారు. పలు ఆలయాల్లో తులసి చెట్టుకు, గోవుకు పూజలు చేశారు. ఉపవాస దీక్షతో రాత్రి విష్ణు సహస్రనామావళి జపాలు, పారాయణం గావిస్తూ జాగారం చేశారు.

➤తొలి ఏకాదశిని పురస్కరించుకుని నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితుడు యాడ వల్లి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సేవ సభ్యులు పాల్గొన్నారు.

➤ గుడిపాడు గడ్డలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వేద పండితులు కృష్ణమాచారి వరదాచారి ఆధ్వర్యంలో స్వామివార్లకు ఉదయమే పంచామృత అభిషేకాలు, సుప్రభాత సేవ, తిరుమంజన సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

➤పద్మావతి నగర్‌లోని శ్రీకృష్ణ మందిరం, గాంధీ చౌక్‌లోని శ్రీకృష్ణ భజన మందిరంలో స్వామివారికి ఉదయాన్నే పంచామత అభిషేకాలు, క్షీరాభిషేకం సేవలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

➤ శ్రీ కాళికాంబ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు పట్టుచీర, సారె సమర్పించి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు.

➤ కోటా వీధిలోని శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టారు.



నంద్యాలలో మత్స్యావతార అలంకరణలో వెంకటేశ్వర స్వామి



సంజీవ్ నగర్ రామాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతానికి హాజరైన భక్తులు



దొర్నిపాడులో భోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



ఆర్.జంబులదిన్నె అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

➤ బొమ్మల సత్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని స్వామిని గ్రామోత్సవం నిర్వహించారు.

ఉయ్యాలవాడ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఇంజేడు గ్రామంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, ఆర్.జంబులదిన్నె గ్రామంలో అభయాంజనేయస్వామి, సుద్దమల్లలో శ్రీలక్ష్మీ నరసింహ కంబగిరిస్వామిలకు ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అనంతయ్య, లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లకు అభిషేకం, మహా మంగళహారతి, ఆకుపూజ, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. పంచామృతాభిషేకాలు, సుప్రభాత సేవ, తిరుమంజనం సేవ నిర్వహించారు.

దొర్నిపాడు: ఆషాఢమాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. దీంతో ఆదివారం మహిళలంతా ఉపవాసాలతో దీక్షలు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా జాగరణ చేస్తూ భాగవం, విష్ణుసహస్రనామ పారాయణం చేస్తారు.

ముగిసిన మొహర్రం



అశేష భక్త జన సందోహం మధ్య చాగలమర్రిలో శ్రీలాల్‌స్వామి ఊరేగింపు దృశ్యం

● భక్తి శ్రద్ధలతో పీర్లకు నిమజ్జనం

చాగలమర్రి: హిందూ ముస్లింలు కలసిమెలసి జరుపుకునే మొహర్రం వేడుకలు ఆదివారం పీర్ల నిమజ్జనంతో ముగిశాయి. పదిరోజులపాటు పీర్లు ప్రత్యేక ఫాతెహాలు అందుకున్నాయి. చివరి రోజు మండల కేంద్రమైన చాగలమర్రిలో శ్రీలాల్‌స్వామి చిన్న సరిగెత్తు (పగలు సవారి) వేలాది మంది భక్త జనం మధ్య సాగింది. దారి పొడవునా పలువురు స్వామి వారికి ముడుపులు చెల్లించి, చొంగా రొట్టేలతో ప్రత్యేక చదివింపులు సమర్పించారు. చాగలమర్రిలో ఈ వేడుక మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఊరేగింపు సందర్భంగా ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీలాల్‌స్వామి కమిటీ అధ్యక్షుడు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు ముల్లా ఇబ్రహీం, ప్రధానకార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా, సంయుక్త కార్యదర్శి ముల్లా షఫి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం, యాల్లావత్తుల, కోటకొండ తదితర గ్రామాల్లో పీర్లకు ఊరేగించి వేడుకలను ముగించారు. మండలకేంద్రం రుద్రవరంలో పెద్దసరిగెత్తు వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు పీర్లవద్దకు వెళ్లి అగ్నిగుండం చుట్టు ప్రదర్శనలు చేసి పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించుకున్నారు.

నంద్యాల (అర్బన్): మండలంలోని పలు గ్రామాల్లో నాలుగు రోజుల క్రితం కొలువైన పీర్లు ఆదివారం నిమజ్జనానికి వెళ్లాయి. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లకు ఫాతేహాలు సమర్పించారు. మండలంలోని కానాల, చాబోలు, అయ్యలూరు, భీమవరం, పోలూరు తదితర గ్రామాల్లో పీర్ల నిమజ్జన కార్యక్రమం జరిగింది.

గోస్పాడు: మండలంలోని ఒంటివెలగల, యాళ్లూరు, జూలేపల్లె, కానాలపల్లెలలో ఏర్పాటు చేసిన పీర్లను ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. చిన్న, మధ్య, పెద్ద సరిగెత్తుల కార్యక్రమాల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని కాల్వల వద్ద పీర్లను నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో మధ్య సరిగెత్తు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులోని చావిడిలో కొలువైన దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి, బారయ్య స్వాములకు ఆదివారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో మధ్యసరిగెత్తు వేడుకలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పీర్ల నిమజ్జనం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో పీర్ల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. కల్పనసెంటర్‌లో ఇమామ్‌కాశీం, చాంద్‌బాడలో అలీఅక్బార్, ఇమామ్‌కాశీం, అలీఅబ్బాస్, మాల్దారిపేటలో మౌలాలిస్వామి, తొట్టిబావి వద్ద ఉన్న ఉజాలాతాబుచ్, గాంధీచౌక్‌లో హసన్, జమాల్ బాషా దర్గా వద్ద అలీఅక్బర్, అలీఅక్బర్, బాదుల్ సాహెబ్, సాధిక్ నగర్‌లో అలీఅక్బార్, హసన్ హలీమ్, నూనెపల్లెలోని మౌలాలిస్వామి, ఏకలవ్య నగర్‌లో దస్తగిరిస్వాములకు ముజావర్లు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. యువకులు గంధం చల్లుకుంటూ మాతం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కుందూనది వద్ద పీర్లను నిమజ్జనం చేశారు.



శ్రీరంగాపురంలో ఊరేగుతున్న పీర్లు



కానాలలో నిమజ్జనానికి వెళ్తున్న ఉసేన్‌వలిపీరు



నంద్యాలలో పీర్ల ఊరేగింపులో యువకుల ఉత్సాహం



ప్రత్యేక అలంకరణలో చావిడిలో కొలువైన పీర్లు

క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించడంతో వారు పెద్దమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

ఆళ్లగడ్డ: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నంద్యాల బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులకు గురౌతున్నారని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల అలాంటి వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ టీం అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బానకచెర్ల నుంచి నీటి విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్యలు నీటి విడుదల చేశారు. ముందుగా పూజలు నిర్వహించి నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేశారు. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కేసీసీ ఎస్కేప్‌ఛానల్‌కు వెయ్యి క్యూసెక్కులు, తెలుగుగంగ(వీబీఆర్)కు 5,000 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా 10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

అసంపూర్తిగా గేట్ల పునరుద్ధరణ

బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద చేపట్టిన గేట్ల పునరుద్ధరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పీఎన్‌సీ కంపెనీ వారు రూ4.5 కోట్ల నిధులతో 9 గేట్ల పునరుద్ధరణకు పనులు చేపట్టారు. కాగా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఎస్‌ఆర్‌బీసీ పాత గేట్ల నుంచి కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 1000క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగింది. కార్యక్రమంలో డీఈ నగేష్, ఏఈలు దేవేంద్ర, విశ్వనాథ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై పార్కింగ్... భక్తుల అవస్థలు



నడిరోడ్డుపైనే పార్కింగ్‌తో రెండు వైపులా నిలిచిపోయిన వాహనాలు

మహానంది: క్షేత్రంలోని కొందరు లాడ్జీల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆదాయం కోసం భక్తులకు అవస్థలు తెచ్చి పెడుతున్నారు. లాడ్జీల వద్ద పార్కింగ్ స్థలం లేకపోగా నడిరోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయిస్తుండటంతో భక్తులు, ఇతర వాహనదారుల కష్టాలు వర్ణనాతీతం. గాజులపల్లె నుంచి మహానంది వైపు వెళ్లే ప్రధాన రహదారిలోని పార్వతీపురం వైపు లాడ్జీలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం నూతన సీసీ రోడ్డు నిర్మిస్తుండటంతో లాడ్జీల్లో బస చేసేందుకు వచ్చిన వారి వాహనాలను యజమానులు రోడ్డుపైనే పార్కింగ్ చేయిస్తుండటంతో నిత్యం కష్టాలు ఎదురవుతున్నాయి. ఒక్కో గదికి రూ.2వేల నుంచి రూ. 3వేలు వసూలు చేస్తున్న లాడ్జీల యజమానులు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ, దేవస్థానం స్థలాల్లో, నడిరోడ్డుపై పార్కింగ్ చేయించడమేంటని పలువురు వాగ్వాదానికి దిగుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పోలీసులు, దేవస్థానం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనం



మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్

కర్నూలు(హాస్పిటల్): భిన్నత్వంలో ఏకత్వం ఉండే గొప్ప దేశం భారత్ అని, దేశంలో ప్రతి పౌరుడు భద్రంగా ఉండాలంటే గాంధీ, అంబేడ్కర్, మార్క్స్ భావజాలాలు నేటి సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతాయో పరిశోధన చేసి ఉపయోగించుకోవాలని తెలంగాణ జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు డాక్టర్ ఎల్.మురళీధర్ సూచించారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో మూఢ నమ్మకాలు ఇంకెంతకాలమని, ఇకనైనా సైన్స్ పరిశోధనలకు ప్రభుత్వాలు నిధులు కేటాయించి ప్రోత్సహించాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. సైన్స్‌ను ఉపయోగించుకునే మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తున్నారని వాపోయారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలో సాగు, తాగునీటి సమస్య ఉందని, ప్రతి పౌరుడు సీమ నీటి విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. లేకపోతే రాబోయే కాలంలో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, ఇప్పటికే పశ్చిమ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, క్లస్టర్ వర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్‌బాను, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు అరుణ, మహమ్మద్ మియ్యా, నాగరాజు, ప్రతాపరెడ్డి, శేషాద్రిరెడ్డి, సుధీర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 8న నంద్యాలలో జరిగే సీపీఐ పట్టణ 17వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ప్రసాద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సలీంనగర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఐ ముందుండి పోరాడుతుందన్నారు. మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, రామంజనేయులు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయకులు హాజరవుతారన్నారు. పట్టణ నాయకలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

కార్మిక నాయకుడికి నివాళి

నంద్యాల(న్యూటౌన్): కార్మిక నాయకుడు కమాల్ హుసేన్ ఆశయ సాధనకై ఉద్యమించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు ఎస్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం కమాల్‌హుసేన్ 6వ వర్ధంతిని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీఎఫ్ నాయకులు చౌడప్ప, పీడీఎస్‌యూ నాయకులు రాంబాబు, రైతు కూలీ సంఘం నాయకులు పఠాన్ ఖాజామియా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన




మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ప్రధానంగా పత్తి పంటకు సోకే గులాబి రంగు పురుగు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకొని రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పత్తి పంటకు గులాబి రంగు పురుగు ఎక్కువ నష్టం కలిగిస్తుందన్నారు. పురుగుల ఉధృతిని తెలుసుకునేందుకు ఎకరానికి ఐదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పత్తిలో అంతరపంటలుగా పెసర, మినుము, సోయాచిక్కుడు వేసుకొని మిత్ర పురుగులను అభివృద్ధి చేసుకుంటే ప్రధాన పంటకు హాని కలిగేచే పురుగులను నివారించుకోవచ్చని వివరించారు. సింథటిక్ పైరత్రోయిడ్ పంట 80 రోజులలోపు వాడరాదని, బెట్ట పరిస్థితులు ఉన్నపుడు అంతర సేద్యం చేయాలని, పోటాషియం నైట్రేటు 2 శాతం పిచికారీ చేయాలన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయ కర్త జయచంద్ర మాట్లాడుతూ.. యూరియా మోతాదుకు మించి వేయడం వల్ల మిత్ర పురుగులు తగ్గి రసం పీల్చే పురుగుల తీవ్రత పెరుగుతుందన్నారు. పత్తిలో పూత, మొగ్గ రాలినపుడు ఎన్‌ఏఏ 10 పీపీఎం, బొరాక్స్ పిచికారీ చేయాలన్నారు. పలువురు ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్, మార్క్‌ఫెడ్‌ల వద్ద 93, 995 టన్నుల ఎరువులు ఉంచినట్లు వెల్లడించారు. ఇందులో యూరియా 31,059 టన్నులు, డీఏపీ 7,150, పొటాష్ 6,380, సూపర్ 2,775, కాంప్లెక్స్ ఎరువులు 46,630 టన్నులు ఉన్నాయన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఇప్పటివరకు 39,500 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు అయ్యాయన్నారు. ఇందులో మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో వేసినట్లు తెలిపారు. రైతులు అవసరం మేరకు ఎరువులు కొనుగోలు చేస్తే కొరత ఉండదని చెప్పారు.

అధిక రక్తపోటు ఆరోగ్యానికి చేటు



డాక్టర్ ఎ.వసంతకుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ పి.చంద్రశేఖర్, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): అధిక రక్తపోటు అదుపులో లేకుంటే ప్రమాదకరమని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధిక రక్తపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.వసంతకుమార్ మాట్లాడుతూ.. ఆధునిక అల్లోపతి మందులతో అధిక రక్తపోటు నియంత్రణలో ఉంచుతున్నట్లు తెలిపారు. తీవ్రమైన మానసిక ఒత్తిడి, స్థూలకాయం, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్ల వల్ల అధిక రక్తపోటు బాధితులు పెరుగుతున్నట్లు చెప్పారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకుని ప్రతిరోజూ వ్యాయామం చేయడం, కొవ్వు, నూనె ఎక్కువగా ఉన్న పదార్థాలను తినడం తగ్గించాలన్నారు. అధిక రక్తపోటు వల్ల పక్షవాతం, గుండెపోటు, రక్తనాళాలు దెబ్బతినడం వల్ల ప్రాణాంతకం అవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యకర జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, సభ్యులు ఘనంగా సన్మానించారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు ఆదివారం విశాఖపట్నంకు చెందిన బి.పోతురాజు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు పి.దేవికకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రం, లడ్డుప్రసాదం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

క్రికెట్ టోర్నీ విజేత కాలో కింగ్స్



విజేత జట్టుకు నగదు, షీల్డ్ అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో కొన్ని రోజులుగా హోరాహోరీగా కొనసాగిన క్రికెట్ పోటీలు ముగిశాయి. ఆదివారం కాలో కింగ్స్, ఎస్‌బీఎంఎస్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. కాలో కింగ్స్ విజేతగా నిలిచింది. తమ మిత్రుడు మల్లికార్జుననాయక్ జ్ఞాపకార్థం కాలో ప్రీమియర్ లీగ్ సీజన్–1 టోర్నమెంట్‌ను వారి మిత్ర బృందం నిర్వహించారు. టోర్నీలో సుమారు 40 జట్లు పాల్గొన్నాయి. విజేత జట్టుకు నిర్వాహకులు మొదటి బహుమతి రూ.1,35,000, షీల్డ్, రన్నర్స్‌కు రూ.75వేలు, కప్పు, తృతీయ స్థానంలో నిలిచిన ఫియర్‌లెస్ ఫాల్కన్స్ జట్టుకు రూ.40వేలు, కప్పును శ్రీశైలం తెలుగు యూనివర్శిటీ పీఠాధిపతి ముసుగు శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, జనసేన పార్టీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రౌతు అశోక్, జక్కంపూడి మణికంఠ, అరవింద్ అందజేశారు. నిర్వాహకులుగా మల్లికార్జున నాయక్ మిత్రబృందం వ్యవహరించారు.

సౌకర్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి



యాంఫీ థియేటర్‌ను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన పరిధిలోని హటకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయాల వద్ద యాత్రికుల సదుపాయ కేంద్రాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం యాంఫీ థియేటర్, గణేశ సదనం, శిఖరేశ్వరాలయం, సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ భక్తుల రద్దీ అధికంగా ఉండే శ్రావణమాసం, కార్తీకమాసం సమయాల్లో భక్తులను అలరించేందుకు యాంఫీ థియేటర్ వద్ద ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని పీఆర్వోను ఆదేశించారు. గణేశ సదనంలో గదుల శుభ్రతపై నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ప్రధాన రహదారి నుంచి శిఖరేశ్వరం వరకు సీసీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. శిఖరేశ్వర ఆలయ మెట్ల మార్గంలో అవసరమైనచోట్ల మరమ్మతులు చేయాలని, పుష్కరిణిలోని పూడిక తీసి శుభ్రంగా ఉంచాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, వసతి, రెవెన్యూ విభాగాల పర్యవేక్షకులు బి.శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసరావు, ఏఈలు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



పెంపుడు కుక్కలను రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి

దొర్నిపాడు: రేబిస్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి చిన్నబాబు అన్నారు. ఆదివారం జూనోసిస్ డేను పురస్కరించుకొని పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేశారు. రేబిస్ సోకిన జంతువుల లాలాజలం, వాటి కాటు ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. రేబిస్ సోకిన తర్వాత చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కావచ్చన్నారు. కాంతికి తట్టుకోలేకపోవడం, చొంగకార్చడం, నీటికి బయపడటం, పక్షవాతం, జ్వరం, తలనొప్పి, వాంతులు వంటివి లక్షణాలు ఉంటాయన్నారు.

కుక్కకాటు ప్రమాదకరం

రుద్రవరం: పిచ్చికుక్క కాటు చాలా ప్రమాదకరం అని కాటుకు గురైన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ సూచించారు. ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. మండలంలో 250 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం తీవ్రతరం చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో టెక్కె మార్కెట్ యార్డు నుంచి గాంధీ చౌక్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ మోదీ సర్కారు కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. 44 కార్మిక చట్టాలను కుదింపజేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు కేంద్రం ప్రభుత్వం ఊడిగం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వరంగం సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు నేటి వరకు అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయడం లేదని, అలాగే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఆరోపించారు. ఇలాంటి అనేక సమస్యలపై ప్రభుత్వాల తీరును నిరసిస్తూ సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటలింగం, ఏఐటీయూసీ నాయకులు గోపాల్, జైలాన్, వెంకటరావ్, షఫి, తదితరులు పాల్గొన్నారు.